వాణ్ని. అలాంటి నాకు ‘హింస’, ‘బాధ’లతో ముడిపడి ఉండే ఒక ప్రమాదకర ప్రవృత్తి (ప్రొపెన్సిటీ)ని ఇచ్చాడు ఆ భగవంతుడు! మై బ్రెయిన్ ఈజ్ నాట్ ‘వైర్డ్ కరెక్ట్‌లీ!’. నా సెక్సువల్ ఓరియంటేషన్‌లో ‘అపసవ్యత’ ఉంది. సాటి మనిషికేకాదు.. సృష్టిలో ఏ ప్రాణికీ హాని కలిగించకూడదని త్రికరణశుద్ధితో నమ్మే నన్ను.. ప్రీ–ప్యుబెర్టిక్ పిల్లల పట్ల ‘ఆకర్షణ’ కలిగి ఉండే పీడోఫిలిక్ డిజార్డర్‌తో పుట్టించిన ఆ దేవుణ్ని ఏం చేయగలను నేను!? నావల్ల ఏ చిట్టిపాపకూ హాని జరగకుండా ముందుజాగ్రత్త కోసమే యాంటీయాన్డ్రోజన్ మందులు తీసుకుంటున్నాను. ఇంతదాకా ఏ ‘తప్పూ’ జరగకుండా జాగ్రత్త పడగలిగాను. కానీ, ఎప్పుడు విస్ఫోటిస్తానో తెలీని భయంకరమైన పేలుడు పదార్థం లాంటివాణ్ని నేను. ఒక ‘అపసవ్యత’ కారణంగా ఏ చిన్నారి కంటి నుంచీ ఒక్క  అశ్రుబిందువూ జారకూడదంటే, నాలాంటి వాడు బతికి ఉండకూడదు. సమాజం పట్ల నా బాధ్యత అది. ట్రక్‌కి ఎదురువెళ్లినా చావు రాలేదు. అసంపూర్తిగా మిగిలిపోయిన ఆ ‘బాధ్యత’ని పూర్తి చేసే వీలు కల్పించండి డాక్టర్! నాకేదైనా విషమివ్వండి ప్లీజ్!’’..

మానవత్వపు పరిమళంతో నిండిన అతనిలోని ఆ ఆర్ద్రతకు కదిలిపోయింది డా.దీపిక.

‘‘శరత్! మీలోని ఆ ‘అపసవ్యత’ కారణంగా ఎక్కడో ఎవరికో కీడు జరుగుతుందేమో అన్న భయంతో ఆత్మాహుతికే సిద్ధమయ్యారంటే మీదెంత మంచి మనసో నాకు అర్థం అవుతున్నది. ఆ ‘మంచిమనసు’ బతకాలి. అయినా, ఎంతటి సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ జీవితాన్ని ‘చేజారి’ పోనీకూడదు. నేనెదుర్కొన్న కష్టం ఏంటో  తెలిస్తే.. మీ ‘సమస్య’ చిన్నదిగా కనిపిస్తుందేమో! దాన్ని అధిగమించవచ్చనే నమ్మకమూ కలుగుతుందేమో వినండి!’’.. అంటూ తన కథ చెప్పడం మొదలుపెట్టింది.

* * *

తండాలో సంచారజాతుల కుటుంబంలో నిరుపేద జన్మ నాది. పగటి బాగోతుల కులవృత్తిని నమ్ముకుని బతికేవాళ్లం! నన్నూ ఆ కులవృత్తిలోకే తేవాలనుకున్నాడు మా నాన్న. అమ్మకు మాత్రం నన్ను బాగా చదివించాలని ఉండేది. నాకూ చదువుపైనే ధ్యాస. ఐదో తరగతి తర్వాత నన్ను సంక్షేమ వసతిగృహంలో వేశారు. బాగా చదువుతానని నన్ను ఆప్యాయంగా చూసుకునేవాడు అక్కడి వార్డెన్ రామయ్య సార్. ఆంగ్లంలో ఆయనకు మంచి పట్టుంది. నేను పదో తరగతిలో ఉండగా ఓరోజు ఆంగ్ల వ్యాకరణం నేర్పించడానికి తనవద్దకు రప్పించుకుని నాపై అఘాయిత్యం చేశాడు! అమ్మానాన్నలకు ఆ విషయం చెబితే నమ్మలేదు. ‘రామయ్య సారు దేవుడు లాటోరు’ అన్నారు. పైనున్న దేవుడికి తెలుసు కదా నిజమేంటో! అందుకే.. రెండో రోజునే రామయ్యను తన వద్దకు ‘తీసుకుపోయాడు’! స్కూటర్‌పై వెళ్తున్న రామయ్య బండి హఠాత్తుగా అదుపుతప్పింది. ట్రాక్టర్‌ని గుద్దేసింది. దాంతో ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. అమ్మా నాన్నా నమ్మలేదు కానీ, నాపై జరిగిన పైశాచికత్వాన్ని ఒక వ్యక్తి నమ్మారు. ‘నమ్మడం’ కాదు. ఆ వ్యక్తికి ‘తెలుసు’ కూడా! ఆ వ్యక్తి.. సీతక్క. వార్డెన్ సార్ భార్య. తను డిగ్రీ చదివింది. ఉద్యోగాలకోసం చూడకుండా సేంద్రియ వ్యవసాయం చేసేది. భర్త వికృత లైంగికత్వం గురించి ఆవిడకు తెలుసు. వార్డెన్ ముసుగులో నాలాంటి చాలామంది పసిమొగ్గల్ని చిదిమేశాడు ఆ ‘రావణాసురుడు’! రోడ్డు ప్రమాదంలో భర్త చనిపోయినప్పుడు ఒక్క కన్నీటి చుక్కా ఆవిడ కళ్ల నుంచి రాలేదు.


‘చదివి ఏమవ్వాలని అనుకుంటున్నావు?’ అనడిగింది సీతక్క నన్ను.

‘డాక్టర్ అవుతానమ్మా!’ అని చెప్పా! నన్ను గుండెకు హత్తుకుంది.

‘నువ్వు డాక్టర్‌వి అయ్యేందుకు నేను అండగా ఉంటాను’ అన్నది. అప్పటినుంచి సీతక్క నాకు ‘సీతమ్మ’ అయిపోయింది. ఆ ‘అమ్మ’ ఆసరాతో డాక్టర్‌ను అయిపోతా అనుకున్నాను. కానీ, విధి నాకోసం మరింత ‘కఠిన’ పరీక్షను సిద్ధం చేస్తున్నదని అప్పుడు తెలీలేదు!’’..

* * *

నేను వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న రోజులవి. ఆనందంగానే ఉండేదాన్ని.. ఆ




‘నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం’ సంయుక్తంగా నిర్వహించిన ‘కథల పోటీ-2023/24’లో తృతీయ బహుమతి రూ.10 వేలు పొందిన కథ.